ప్రజాశక్తి

శుక్రవారం 26 డిసెంబర్ 2025

7


శ్రీ సత్యసాయి





పుట్టపర్తి ప్రశాంతి నిలయంలో క్రిస్మస్ వేడుకలు

కాలువలో నీరు.. రైతులకు కన్నీరు..!



మడకశిరకు పోతున్న కృష్ణా జలాలు



హంద్రీనీవా నీటి పంపింగ్

హిందూపురం ప్రాంతంలో ఎన్నికలు ఎప్పుడొచ్చినా... పార్టీలు ఏవైనా... నాయకులు చెప్పే మాట ఒక్కటే. 'హంద్రీనీవా ద్వారా కృష్ణా జలాలను తీసుకొస్తాం'... చెరువులన్నీ నింపి, వ్యవసాయ భూములను సస్యశ్యామలం చేస్తాం.' అంటూ బీరాలు పలుకుతారు. ఇలా ప్రతి ఎన్నికల్లోనూ నేతలు ఓట్ల కోసం నీటి హామీలను ఇస్తూనే ఉన్నారు. అధికారంలోకి రాగానే ఆ హామీ సంగతే మర్చిపోతున్నారు. కళ్లముందే కాలువల ద్వారా కృష్ణా జలాలు గత నాలుగు నెలల నుంచి మడకశిర నియోజకవర్గాని హిందూపురం మీదుగా వెళ్తున్నాయి. ఇందులో ఒక చుక్క కూడా హిందూపురం ప్రాంతంలోని చెరువులకు చేరడం లేదు. నీటిని తెచ్చుకోవడంలో మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్.రాజుకు ఉన్న శ్రద్ధ హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణకు లేదంటూ పురం ప్రజలు పెదవి విరుస్తున్నారు.

- కళ్లముందే నీరెళ్తున్నా పురం చెరువులకు చేరని వైనం
- హంద్రీనీవా జలాల కోసం ఏళ్లుగా తప్పని ఎదురుచూపు
- నీటిమూటలవుతున్న బాలయ్య హామీ
- ఎమ్మెల్యే తీరుపై రైతుల పెదవివిరుపు

ప్రజాశక్తి-హిందూపురం

మాల్యాల నుంచి హంద్రీనీవా కాలువ ద్వారా జూలై 22 నుంచి నీటిని గొల్లపల్లి రిజర్వాయర్‌కు మళ్లించారు. గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి సెప్టెంబర్ 25వ తేదీ నుంచి మడకశిర ప్రాంతానికి నీళ్లు వచ్చాయి. మానూరు, హరే సముద్రం, సి.కొడిగేపల్లి, కల్లూరు, మడకశిర, గుడిబండ చెరువుకులకు 25 నుంచి 30 శాతం మాత్రమే నింపారు. డిసెంబర్ 17వ తేదీ నుంచి హిందూపురం ప్రాంతంలోని బేవినహళ్లి, అప్పలకుంట కిరికిరా, కోటిపి, చెరువులకు నీళ్లు వదిలాల్సి ఉంది. ఇవి నిండిన అనంతరం సూగూరు, సూరప్పకుంట, శ్రీకంఠపురం, కొట్నూరు చెరువులకు నీళ్లు వదులుతామని అధికారులు పేర్కొన్నారు. అయితే ఇప్పటి వరక మడకశిర ప్రాంతానికే నీళ్ల పోతున్నాయి. గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి మడకశిర బ్రాంచ్ కెనాల్ వరకు 265 చెరువులు ఉన్నాయి. 2018లో స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అప్పటి, ఇప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో కలిసి లేపాక్షి పెద్ద చెరువు వద్ద జలహారతి ఇచ్చి కృష్ణ జలాలను చెరువులకు మళ్లించారు. ఆ సమయంలో హిందూపురం నియోజక వర్గంలోని లేపాక్షి మండలంతో పాట హిందూపురం పట్టణం, రూరల్ మండల వ్యాప్తంగా ఉన్న చెరువులకు నీటిని మళ్లించి అన్ని చెరువులనూ నింపుతామని మాటిచ్చారు. దేమకేతపల్లి వద్ద ఎత్తిపోతల ద్వారా చిలమత్తూరు మండలంలో ఉన్న అన్ని చెరువులనూ నీటితో నింపుతామంటూ ఎమ్మెల్యే బాలకృష్ణ తెలిపారు. ఇందుకోసం రూ.500 కోట్లతో డిపిఆర్ సైతం సిద్ధం చేశామన్నారు. మాట ఇచ్చి ఏడేళ్లు గడుస్తున్నా ఇప్పటి వరకు హిందూపురం పరిధిలోని చెరెవులకు నీరు చేరలేదు. ముఖ్యమంత్రితో కలిసి జలహారతి ఇచ్చిన లేపాక్షి మండలంలోని 26 చెరువులకు కూడా నీరివ్వని పరిస్థితి నెలకొంది. హిందూపురం మండలంలో 31 చెరువులకు నీళ్లి ఇవ్వాల్సి ఉంది. ఇప్పటి వరకు ఇవ్వలేక పోయారు. 2020, 21 రెండు సంవత్సరాల మంచి వర్షాలు కురవడం వల్ల చెరువులన్నీ నిండాయి. దీంతో నాలుగు సంవత్సరాలుగా హంద్రీనీవా నీటి ద్వారా హిందూపురం, మడకశిర ప్రాంతంలో చెరువులు నింపలేదు. 2024 సంవత్సరంలో గొల్లపల్లి రిజర్వాయర్ నిండినప్పటికీ, మడకశిర బ్రాంచ్ కెనాల్ మరమ్మతులతో మూడు నెలలు ఆలస్యంగా మడకశిర బ్రాంచ్ కెనాల్‌కు నీరు వదిలారు. దాని మూలంగా పెనుగొండ, రొద్దం, సోమందేపల్లి మండలాలలో 19 చెరువులు హిందూపురం ప్రాంతంలో నాలుగు నాలుగు చెరువులకు అర, కొర నీరు మాత్రమే ఇచ్చారు. ఈ సంవత్సరం ప్రారంభం నుంచి మడకశిర ప్రాంతానికి నీటిని తరలిస్తున్నారు.

పెదవి విరుస్తున్న రైతులు

కళ్ల ముందే హంద్రీనీవా కాలువ ద్వారా నాలుగు నెలలుగా కృష్ణా జలాలు మడకశిర ప్రాంతానికి వెళ్తున్నాయి. ఈ విషయంపై స్థానిక ఎమ్మెల్యే బాలకృష్ణ ఒక్క మాట సైతం మాట్లాడక పోవడంపై ఈ ప్రాంత రైతులు పెదవి విరుస్తున్నారు. టిడిపి నాయకులు భూసేకరణపై చూపించే శ్రద్ధ కృష్ణ జలాలను తీసుకు రావడంపై చూపడం లేదంటూ రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

శ్రద్ధ చూపితే సస్యశ్యామలం

ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ శ్రద్ధ చూపితే కృష్ణా జలాలతో హిందూపురం నియోజకవర్గంలోని చెరువులు నిండి ఈ ప్రాంతం సస్యశ్యామలం అవుతుంది. 2018లో జలహారతికి ఇచ్చిన శ్రద్ధ చెరువులకు నీటిని తీసుకురావడానికి చూపడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. హిందూపురం ప్రాంతంలో 31 చెరువులు, లేపాక్షి మండలంలో 26 చెరువులకు నీటిని ఇవ్వాల్సి ఉంది. ఇందులో సగం చెరువులకు నీటిని మళ్లించినా ఆయా చెరువుల కింద ఉన్న బీడు భూములన్నీ సాగులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయి. దీంతోపాటు ఎత్తిపోతల పథకం ద్వారా చిలమత్తూరు మండలానికి నీటిని మళ్లించి ఆ మండల వ్యాప్తంగా ఉన్న చెరువులకు నీటిని అందిస్తే ఈ ప్రాంత ప్రజలు ఎమ్మెల్యే బాలకృష్ణ పేరును వారి జీవితాంతం గుర్తుపెట్టుకుంటారు. ఇప్పటికైనా బాలకృష్ణ దృష్టి సారించి హిందూపురం, లేపాక్షి మండలాల్లో ఉన్న చెరువులను పూర్తిస్థాయిలో నింపేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

చెత్తను నింపి..చెరువు మట్టి తోడేసి..!



మురుగు నీటితో దర్శనమిస్తున్న శ్రీకంఠపురం చెరువు

కృష్ణ జలాలతో చెరువులను నింపాల్సిన అధికార పార్టీ నాయకులు డంపింగ్ యార్డుకు తరలించాల్సిన చెత్తను చెరువుల్లో పారబొస్తున్నారు. ఇది చాలదన్నట్లు మండల వ్యాప్తంగా చెరువు మట్టిని అధికార పార్టీ నేతల కనుసన్నల్లో జెసిబిలు పెట్టి తోడేస్తున్నారు. ఇంత జరుగుతున్నప్పటికీ నీటిపారుద శాఖ అధికారులు ఏ ఒక్కరిపై చర్యలు తీసుకోవడం లేదు.



సడ్లపల్లి చెరువులో డంపింగ్ యార్డు నుంచి తరలించిన చెత్త

క్రిస్మస్ శోభ

- జిల్లా వ్యాప్తంగా క్రిస్మస్ సంబరాలు
- చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు
- శాంతిసందేశం విన్పించిన పాస్టర్లు

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

ఏసు క్రీస్తు బాలయేసుగా భూమిపై అవతరించిన వేళ క్రీస్తుస్మరణ మారుమోగింది. చర్చిల్లో స్టార్లు కాంతులీనాయి. క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలతో మురిసిపోయాయి. జిల్లా అంతటా క్రిస్మస్ శోభ సంతరించుకుంది. బుధవారం రాత్రి నుంచే చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు ప్రారంభం అయ్యాయి. గురువారం మధ్యాహ్నం వరకు ఇవి కొనసాగాయి. క్రిస్టియన్లు నూతన దుస్తులు ధరించి హ్యాపీ క్రిస్మస్.. మెర్రీ క్రిస్మస్ అంటూ పరస్పర శుభాకాంక్షలు తెలుపుకున్నారు. బిషప్‌లు, ఫాదర్లు, పాస్టర్లు, శాంతిసందేశం వినిపించారు. ఏసు మార్గంలో నడవాలని సూచించారు. చాలా చర్చిల్లో సేవా కార్యక్రమాలను చేపట్టారు. జిల్లాలోని పుట్టపర్తి, ధర్మవరం, కదిరి, హిందూపురం తదితర ప్రాంతాల్లోని చర్చిలు క్రిస్టియన్లతో కిటకిటలాడాయి. ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు చర్చిల్లో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని క్రిస్టియన్ సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. చిన్నారులు శాంటాక్లాజ్ వేషధారణలో అలరించారు.



మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ నిజాంవలీ కాలనీలో ప్రచారం చేస్తున్న సిఐటియు నాయకులు

కార్మిక గొంతు వినిపిద్దాం

- సిఐటియు జాతీయ మహాసభలను జయప్రదం చేయండి
- రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.ఓబులు

ప్రజాశక్తి-కదిరి టౌన్


కార్మికులపై కేంద్రం వ్యవహరిస్తున్న తీరును మహాసభల వేదికగా ఎండగడదామని సిఐటియూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.ఓబుళు తెలియజేశారు. సిఐటియు అఖిల భారత మహాసభలు డిసెంబర్ 31, జనవరి 1,2,3,4వ తేదీల్లో జరగనున్న నేపథ్యంలో మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ గురువారం నాడు కదిరి పట్టణంలోని నిజాంవలీ కాలనీలో కరపత్రాలను పంపిణీ చేశారు. మహాసభల ఆవశ్యకతను కార్మికులకు తెలియజేశారు. ఈ సందర్భంగా ఓబుళు మాట్లాడుతూ సిఐటియు ఆలిండియా మహాసభలు ఆంధ్ర రాష్ట్రంలో మొదటిసారిగా జరుగుతున్నాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలపై మహాసభల్లో చర్చించి భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తారన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేసేలా భవిష్యత్తు పోరాటాలు ఉంటాయన్నారు. బీడీ కార్మికులకు సంక్షేమ చట్టం చేయాలన్నారు. అన్ని రంగాల్లో పని చేస్తున్న అసంఘటిత రంగ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాల్సుందన్నారు. వీటిన్నింటిపై మహాసభల్లో తీర్మానాలు చేయనున్నట్లు చెప్పారు. జనవరి 4వ తేదీన విశాఖపట్నం మున్సిపల్ గ్రౌండ్‌లో జరిగే బహిరంగ సభలో కార్మికులందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియూ జిల్లా ప్రధాన కార్యదర్శి జిఎల్.నరసింహులు, నాయకులు ముస్తాక్, బాబ్జాన్, రామ్మోహన్, తాజుద్దీన్, ఫాజిల్, శాంతిబాయి, నూర్జహాన్ పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకున్న నెలలోపు ఆర్థికసాయం

ప్రజాశక్తి-మడకశిర టౌన్

'ముఖ్యమంత్రి సహాయ నిధి' కోసం దరఖాస్తు చేసుసుకున్న పేదలకు నెలలోపు ఆర్థికసాయం అందేలా చర్యలు తీసుకుంటున్నామని టిడిపి జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే ఎంఎస్.రాజు తెలిపారు. చికిత్సకైన మొత్తంలో 65 శాతం మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అనారోగ్యంతో ఆసుపత్రి పాలై సొంత ఖర్చులతో చికిత్స పొందిన వారిని ఆర్థికంగా ఆదుకునే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మడకశిర నియోజకవర్గంలో వంద మందికి రూ. 35, 56,392కు సంబంధించి చెక్కులు మంజూరయ్యాయి. వాటిని గురువారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో టిడిపి జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి లబ్ధిదారులకు అందజేశారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఎమ్మెల్యే కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్న వారిలో వంద మందికి రూ. 35,56,392 అందాయన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్న వారికి ఎలాంటి పైరవీలు లేకుండా సిఎం రిలీఫ్ ఫండ్ మంజూరు చేయించి ఇచ్చామన్నారు. అవసరమైన అన్ని పత్రాలు అందజేస్తే సాధ్యమైనంత వరకు పార్టీలకు అతీతంగా ప్రభుత్వం నుంచి, సిఎం సహాయనిధి అందేలా తన వంతు ప్రయత్నం చేస్తానన్నారు. పేద, మధ్య తరగతి ప్రజలను సిఎం సహాయ నిధి ద్వారా ఆదుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌మూర్తి, వక్కలిగ కార్పొరేషన్ ఛైర్మన్ లక్ష్మీనారాయణ, నగర పంచాయతీ ఛైర్మన్ నరసింహరాజు, కౌన్సిలర్లు సుభద్ర నాగేంద్ర, ఉమాశంకర్, బలరామ్, వెంకటలక్ష్మమ్మ, మండల కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే



సిఎంఆర్ఎఫ్ చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే రాజు, తిప్పేస్వామి

టిడిపి పార్లమెంట్ కార్యదర్శి నరేష్‌కు సన్మానం

ప్రజాశక్తి-గోరంట్ల


మండలంలోని పులేరు మాజీ సర్పంచి నరేష్‌ను టిడిపి పార్లమెంటు కార్యదర్శిగా నియమిం చారు. దీంతో గురువారం పులేరు పంచాయతీ టిడిపి నాయకులు నరేష్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పూలమాలలు, శాలువాలతో ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు నరసింహులు, వెంకటరమణయాదవ్, డిష్ శ్రీనివాసులు, చంద్రారెడ్డి, డీలర్ గంగాధరప్ప, తిప్పన్న, తదితరులు పాల్గొన్నారు.



నరేష్‌ను సన్మానిస్తున్న పులేరు పంచాయతీ నాయకులు

టిడిపి జిల్లా అధికారప్రతినిధిగా ఆనంద్‌కుమార్

లేపాక్షి : మండలానికి చెందిన మాజీ ఎంపీపీ ఆనంద్‌కుమార్‌ను టిడిపి జిల్లా అధికార ప్రతినిధిగా నియమించారు. దీంతో గురువారం ఆయనను రాష్ట్ర టూరిజం డైరెక్టర్ జయప్ప ఆధ్వర్యంలో పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ పార్టీ కోసం, ప్రజల కోసం చేసిన తన సేవలను గుర్తించి ఎమ్మెల్యే బాలకృష్ణ ఆదరాభిమానాలతో తనను పార్టీ జిల్లా అధికార ప్రతినిధిగా నియమించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు గోవింద్, అంజి, రవి, రఫిక్, రమేష్, మంజునాథ్, నాగరాజు, బసస్వామి, షెక్షావలి, తదితరులు పాల్గొన్నారు.



ఆనంద్‌కుమార్‌ను సన్మానిస్తున్న టిడిపి నాయకులు

టిడిపి పార్లమెంటరీ ఆర్గనైజింగ్ సెక్రటరీగా శ్రీనివాస్‌మూర్తి

ప్రజాశక్తి-అగళి

మండలానికి చెందిన టిడిపి నాయకులకు పార్టీ నాయకత్వం మరొక అవకాశం కల్పించింది. ఇరిగేపల్లి గ్రామానికి చెందిన శ్రీనివాస్‌మూర్తిని హిందూపురం పార్లమెంటరీ ఆర్గనైజింగ్ సెక్రటరీగా నియమించింది. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి వెలువడిన ఆదేశాల మేరకు గురువారం ఆయనకు నియామక పత్రం అందజేశారు. దీంతో సింగిల్‌విండో అధ్యక్షులు కుమార్‌స్వామి, జడ్పిటిసి ఉమేష్, మండల కన్వీనర్ తిప్పేస్వామి, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ కెంచు యాదవ్, ఎంపిటిసిలు, సర్పంచులు, మండల నాయకులు, కార్యకర్తలు శ్రీనివాస్‌మూర్తిని మర్యాద పూర్వకంగా కలిసి పూలమాలలు వేసి శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. వారు మాట్లాడుతూ పార్టీ కోసం చిత్తశుద్ధితో పని చేసిన నాయకులు, కార్యకర్తలకు ఎప్పటికైనా గుర్తింపు లభిస్తుందన్నారు. శ్రీనివాస్‌మూర్తి మాట్లాడుతూ జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. అలాగే తనకు ఈ అవకాశం ఇచ్చిన సిఎం చంద్రబాబు, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్, పార్టీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి, మండల కన్వీనర్ తిప్పేస్వామి, సింగిలివిండో అధ్యక్షులు కుమారస్వామి, జడ్పిటిసి ఉమేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

పురుగుల అన్నం.. నీళ్ల చారు..!

అర్ధాకలితో గిరిజన విద్యార్థులు - హాస్టల్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆందోళన

ప్రజాశక్తి-కదిరి టౌన్

హాస్టల్ ఉండి చదువుకుంటున్న గిరిజన విద్యార్థులకు పురుగుల అన్నమ్మే దిక్కైంది. ఆర్థిక స్థోమత లేని పేద విద్యార్థులు చదువుకోసం హాస్టల్‌లో ఉండగా వారి బాగోగులు చూడాల్సిన అధికారులు పట్టించుకోకుండా వదిలేశారు. పురుగుల అన్నం.. నాసిరకం కాయగూరులతో చేసిన చారును తినలేక విద్యార్థులు అర్థాకలితో అలమటించాల్సిన పరిస్థితి నెలకొంది. పురుగల అన్నం పెట్టి అర్థాకలికి గురి చేయడంపై విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. హాస్టల్‌లో ఖాళీ ప్లేట్లు ముందు పెట్టుకుని నిరసన తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... కదిరి పట్టణం అనంతపురం రోడ్డు డిగ్రీ కళాశాల వెనుక గిరిజన వసతి గృహం ఉంది. వసతిగహంలో కొద్ది రోజుల నుంచి అన్నంలో తెల్ల పురుగులు, లక్క పురుగులు వస్తున్నాయి. ఈ విషయాన్ని అధికారులకు విన్నవించినా ఎవరూ పట్టించుకోకపోవడంతో గురువారం నాడు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు మాట్లాడుతూ ట్రైబల్ వెల్ఫేర్ గురుకుల సంక్షేమ పాఠశాల ప్రిన్సిపాల్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ తమకు నాశిరకం భోజనం పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కుళ్లిపోయిన కూరగాయలతో పురుగుల పడిన అన్నం తయారు చేస్తున్నారని చెప్పారు. మంచి అన్నం పెట్టాలని అడిగితే కనీస స్పందన ఉండడం లేదన్నారు. ఉన్నతాధికారులు స్పందించి తమకు నాణ్యమైన ఆహారం అందించేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరారు.



పురుగులు ఉన్న అన్నంను చూపుతున్న విద్యార్థులు

నేడు సర్వసభ్య సమావేశం

గోరంట్ల : స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ కమలాబాయి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ

లేపాక్షి : స్థానిక జామియా మసీదులో గురువారం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా పర్యాటక శాఖ డైరెక్టర్ జయప్ప హాజరై మాట్లాడారు. పేదలు, వృద్ధులకు మదరసా నిర్వాహకులు దుప్పట్లు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఆనంద్‌కుమార్, షెక్షావలి, జాకీర్, ఉస్మాన్‌సాబ్, మంజునాథ్, అంజనరెడ్డి పాల్గొన్నారు.

ఎపిజెఎఫ్ నియోజకవర్గ ఉపాధ్యక్షురాలికి సన్మానం

గోరంట్ల : ఎపిజెఎఫ్ పెనుకొండ నియోజకవర్గ ఉపాధ్యక్షురాలిగా ఎంపికైన నందిని రాయల్‌ను గురువారం ఆమె నివాసంలో ఫెడరేషన్ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించి అభినందనలు తెలిపారు. ఆమె మాస్ టీవీ షాడో పత్రిక ఎడిటర్‌గా పని చేస్తుంది. కార్యక్రమంలో కమ్మవారిపల్లి పంచాయతీ నాయకులు పాల్గొన్నారు.

మైనగానపల్లిలో చట్టాలపై అవగాహన

గుడిబండ : మండల పరిధిలోని మైనగానపల్లి గ్రామంలో గురువారం రాత్రి ఎస్ఐ రాజకుళ్లాయప్ప ఆధ్వర్యంలో ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఎస్ఐ మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన హక్కులు, చట్టాలపై ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలన్నారు. అలాగే రోడ్డు ప్రమాదాలు, బాలికలు, మహిళలపై వేధింపులు, అత్యాచారాలు, వాహన చట్టాలపై అవగాహన కల్పించారు. ప్రధానంగా గ్రామంలో మట్కా, పేకాట, జూదం, నాటుసారా, తదితర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ నాగేష్, ప్రజలు పాల్గొన్నారు.

అంగన్వాడీలకు సెల్‌ఫోన్లు పంపిణీ

ప్రజాశక్తి-మడకశిర టౌన్

ప్రభుత్వం మంజూరు చేసిన సెల్‌ఫోన్లను గురువారం ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మడకశిర నియోజకవర్గంలోని అంగన్వాడీ వర్కర్లకు పంపిణీ చేశారు. మొత్తం 438 అంగన్వాడీ వర్కర్లకు సెల్‌ఫోన్లు అందజేశారు. 44 మినీ అంగన్వాడీలను మెయిన్ అంగన్వాడీలుగా ఉన్నతీకరించడంతో ప్రొసీడింగ్ పత్రాలను అందజేశారు. ప్రభుత్వం అంగన్వాడీ ఆయాలు, కార్యకర్తలకు ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో వక్కలిగ కార్పొరేషన్ ఛైర్మన్ లక్ష్మీనారాయణ, డాక్టర్ శ్రీనివాస్ మూర్తి, సిడిపిఒ నాగమల్లేశ్వరి, అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు



అంగన్వాడీ కార్యకర్తలకు సెల్‌ఫోన్లు అందజేసి ఎమ్మెల్యే రాజు, తిప్పేస్వామి

నేడు ప్రజాదర్బార్

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

ప్రజా సమస్యల పరిష్కారం కోసం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు బుక్కపట్నం, పుట్టపర్తి, కొత్తచెరువు మండలాలతో పాటు పుట్టపర్తి మున్సిపాలిటీకి చెందిన ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఎమ్మెల్యే పల్లెసింధూర రెడ్డి ఆధ్వర్యంలో ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు పుట్టపర్తి పట్టణ టిడిపి కన్వీనర్ బోయ రామాంజనేయులు తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రతి శుక్రవారం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ప్రజా గ్రీవెన్స్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు ఈ ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని కొత్తచెరువు, పుట్టపర్తి, బుక్కపట్నం మండలాల ప్రజలతో పాటు పుట్టపర్తి మున్సిపాలిటీ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. "పుట్టపర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పల్లె సింధూర, మాజీమంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి ఏర్పాటు చేసిన ప్రజా దర్బార్ కు ఈ మూడు మండలాలకు సంబంధించిన రెవిన్యూ ,పోలీస్ ,వ్యవసాయ ,విద్యుత్ ,పశు శ్వర్ధక ,గ్రామీణాభివృద్ధి ,గ్రామీణ తాగునీటి సరఫరా, వైద్యం , మెప్మా, డీఆర్డీ డీఏ వెలుగు , ఐసీడీఎస్, పంచాయతీరాజ్ ,ఆర్ అండ్ బి ,అటవీశాఖ, ఆర్టీసీ, ఉపాధి హామీతోపాటు మిగతా అన్ని శాఖల ప్రభుత్వ అధికారులు ప్రజాప్రతినిధులు కూటమి పార్టీల నాయకులు హాజరు కావాలని ఆయన కోరారు.

శక్తి యాప్‌పై అవగాహన

ప్రజాశక్తి - కదిరి అర్బన్

సెక్యూరిటీ విభాగం ఆధ్వర్యంలో శక్తి యాప్ పై కేజీబీవీ పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇటీవలి కాలంలో మహిళలు, బాలికలపై జరుగుతున్న అఘాయిత్యాలు, సైబర్ నేరాలు, పోక్సో కేసుల నేపథ్యంలో విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలన్నారు. తమ భద్రత తమ చేతుల్లోనే ఉందని అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. మహిళల రక్షణకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న భద్రతా చర్యలపై విస్తృతంగా వివరించారు. ప్రతి విద్యార్థిని తన మొబైల్ ఫోన్‌లో శక్తి యాప్‌ను తప్పనిసరిగా డౌన్లోడ్ చేసుకోవాలని, ప్రమాద పరిస్థితుల్లో ఒక్క క్లిక్‌తో పోలీసుల సహాయాన్ని కోరవచ్చని వివరించారు. శక్తి యాప్ ద్వారా మహిళలు తమ లొకేషన్‌ను వెంటనే పోలీసులకు షేర్ చేయవచ్చని, ఇది మహిళల భద్రతకు అత్యంత ఉపయోగకరమైన సాధనమని తెలిపారు. ఈ కార్యక్రమంలో శక్తి టీమ్ పీసీ ఎస్. చలపతి, షౌకత్ ఖాన్ పాల్గొన్నారు.

సిఐటియు జాతీయ మహాసభలను జయప్రదం చేద్దాం



కరపత్రాలను పంపిణీ చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - తలుపుల

ఈనెల 31వ తేదీ నుండి జనవరి 4వ తేదీ వరకు విశాఖపట్నంలో జరుగుతున్న సిఐటియు ఆల్ ఇండియా మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు కోరారు. ఈ మేరకు మండల కేంద్రంలో పంచాయతీ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో కరపత్రాలను సిఐటియు నాయకులు విడుదల చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సిఐటియు ఆలిండియా మహాసభలు ఆంధ్ర రాష్ట్రంలో మొదటిసారిగా జరుగుతున్నాయని చెప్పారు. ఈ మహాసభలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక ,ప్రజావ్యతిరేక విధానాలపై చర్చించి భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తామని చెప్పారు. ప్రధానంగా కేంద్ర ప్రభుత్వం దేశంలోని కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, దేశంలోని కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని, తీర్మానాలు చేయబోతున్నామన్నారు. జనవరి 4వ తేదీన విశాఖపట్నం మున్సిపల్ గ్రౌండ్ లో లక్షలాది మంది కార్మికులతో ర్యాలీ బహిరంగ సభ జరుగుతుందని ఈ మహాసభ జయప్రదం కోసం తలుపుల మండలంలోని కార్మికులు,ఉద్యోగులు, ప్రజలు సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి బి సాంబశివ, మండల కన్వీనర్ భాష, నారాయణ, అరుణ, గంగమ్మ, శివమ్మ, అశోక్, చిన్న దొడ్డప్ప, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

చిలమత్తూరు : ఈనెల 31 నుంచి జనవరి 4 వరకు విశాఖపట్నంలో జరిగే సిఐటియు అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు రామచంద్ర పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం మండల పరిధిలోని కోడూరు టెక్స్ పోర్ట్ సిండికేట్ గార్మెంట్స్ లో కార్మికులకు కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు మాట్లాడుతూ కార్పొరేట్లకు మేలు చేసేందుకు, కార్మిక వర్గం హక్కులను హరించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూనుకున్నాయని విమర్శించారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా బలమైన కార్మిక ఉద్యమాన్ని నిర్మించడంలో సిఐటియు అగ్రభాగాన నిలిచిందని తెలిపారు. కార్మికులకు పిఎఫ్, ఇఎస్ఐ అమలు చేయాలని, గ్రాట్యుటీ అమలు చేయాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు అమలు చేయాలని, 8 గంటల పని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఫిరంగి ప్రవీణ్, మంజు, భూమా రెడ్డి, నారాయణప్ప, అంజి, రాధిక, రజియమ్మ, శేఖర్, ఆవులప్ప తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

వైన్ షాపులో చోరీ

మద్యం, నగదు అపహరణ

ప్రజాశక్తి-హిందూపురం

మద్యం దొంగతనాన్నే లక్ష్యంగా చేసుకుని సినీ ఫక్కీలో పక్క ప్రణాళిక ప్రకారం చోరీకి పాల్పడిన సంఘటన చోటుచేసుకుంది. ప్రధాన రహదారికి పక్కనే ఉన్న మద్యం దుకాణంలో చోరీ జరగడం పట్ల స్థానికులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. వైన్ షాప్ ముందు సిమెంట్ రాళ్లు వేసి వాటిపై దుప్పట్లు కప్పి వాచ్ మెన్ నిద్రిస్తున్నట్లుగా రూపకల్పన చేశాడు. ఇంకేముంది షట్టర్ ఓపెన్ చేసి రూ. 30 వేల విలువ చేసే మద్యం, క్యాష్ కౌంటర్ లో ఉన్న రూ.40వేల నగదు దోచుకెళ్లాడు. ఈ సంఘటన శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురం పట్టణం ప్రధాన సర్కిల్ లోని సూర్య వైన్ షాపులో బుధవారం అర్ధరాత్రి జరిగిన సంఘటన. ఉదయం వైన్ షాప్ వద్దకు వెళ్లిన మేనేజర్ షాప్ ముందు దుప్పటి కప్పుకొని ఎవరు పడుకున్నారని వెళ్లి చూసి రాళ్లు ఉండడంతో ఒక్కసారిగా షాక్ గురయ్యాడు. దొంగతనం జరిగిందని గుర్తించి వెంటనే ఎక్సైజ్ అధికారులకు సమాచారం అందించారు. వైన్ షాప్ దగ్గరకు వెళ్లిన అధికారులు సిసి ఫుటేజ్ ద్వారా చోరీ జరిగిన విధానాన్ని గుర్తించి సంఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



షాపులో స్టాకును పరిశీలిస్తున్న అధికారులు

అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి-రొద్దం

అనారోగ్య సమస్యలతో ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గురువారం మండల కేంద్రమైన రొద్దంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. రొద్దంలో నివాసం ఉంటున్న నాగార్జున(38) వృత్తి రీత్యా స్థానిక వెంకటేశ్వరస్వామి ఆలయం పక్కనే బార్బర్ షాపు నిర్వాహిస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. అతడు కొన్ని రోజులుగా కాలేయ సంబంధిత జబ్బుతో బాధ పడేవాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెందిన ఉదయం అద్దెకు ఉంటున్న ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతనికి భార్య, ఇద్దరు కుమార్తెలు, 20 రోజుల కుమారుడు ఉన్నారు. కుటుంబానికి పెద్దదిక్కు, ఆధారమైన అతడి మృతితో వారు శోకసముద్రంలో మునిగిపోయారు.

మోటార్ల మెకానిక్ షాపులో చోరీ

ప్రజాశక్తి - బత్తలపల్లి

బత్తలపల్లిలోని అనంతపురం రోడ్డుకు గల మోటార్ల మెకానిక్ దుకాణంలో గుర్తు. తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. బాధితుడు దాసరి సాయి సతీష్ (మాధవయ్య చిట్టి) తెలిపిన సమాచారం మేరకు.. బత్తలపల్లిలోని అనంతపురం రోడ్డుకు గత మూడు సంవత్సరాలుగా మెకానిక్ దుకాణం ఏర్పాటు చేసుకున్నారు. యధావిధిగా బుధవారం పనులు ముగించుకుని దుకాణానికి తాళాలు వేసి ఇంటికి వెళ్లారు. గురువారం దుకాణం తలుపులు తెరవడానికి వెళ్లగా అప్పటికే తలుపుల కీళ్లు పగులుకొట్టిఉండటాన్ని దాసరి సాయి సతీష్ గుర్తించాడు. దుకాణంలో మోటార్ల మరమ్మతులకు తెచ్చిన రూ.30వేలు విలువైన కొత్త వైరు, పాత వైరు, గన్ మెటల్ ఎత్తుకెళ్లినట్లు బాధితుడు తెలిపారు. దీనిపై బత్తలపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సాయి సతీష్ చెప్పారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - కదిరి టౌన్

కదిరి పట్టణం కుటాగుళ్ల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. మండలంలోని కాలసముద్రం గ్రామానికి చెందిన నాగరాజు తలుపుల మండలానికి చెందిన శివశంకర్ కదిరి నుంచి ద్విచక్రవాహనంలో వెళుతుండగా కుటాగుళ్ల వద్ద ఎదురుగా వస్తున్న వీరి ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో కాలసముద్రానికి చెందిన నాగరాజు అక్కడికక్కడే మృతిచెందాడు. తీవ్రంగా గాయపడిన శివశంకర్‌ను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



జగన్‌తో మాట్లాడుతున్న అన్సార్

వైఎస్ జగన్‌ను కలిసిన వైసిపి నాయకులు

ప్రజాశక్తి-హిందూపురం

వైసిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని చిలమత్తూరు మండలానికి చెందిన వైసిపి నాయకులు కలిశారు. గురువారం బెంగళూరులోని జక్కురు విమానాశ్రయంలో వైసిపి మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి అన్సర్ అహ్మద్, సీనియర్ నాయకులు మొరసలపల్లి అమర్నాథ్ రెడ్డి జగన్ కలిసి పలు అంశాలపై చర్చించారు. ప్రధానంగా రైతులకు సంబంధించిన భూముల బలవంతపు సేకరణపై జగన్‌కు నాయకులు వివరించారు.

మృతుని కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి - కొత్త చెరువు

మండల పరిధిలోని తలమర్ల కు చెందిన ఎమ్మెల్యే గన్ మెన్ భాస్కర్ రెడ్డి తండ్రి తమటం ఓబుల్ రెడ్డి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పల్లె సింధూర గురువారం గ్రామానికి వెళ్లి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతునికుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ ఒలిపి శ్రీనివాసులు, మండల కన్వీనర్ రామకృష్ణ ,టీడీపీ సీనియర్ నాయకులు ఎస్ శ్రీనివాసులు, కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ముక్కోటి ఏకాదశి ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి - కదిరి అర్బన్

ఈనెల 30వ తేదీ జరగనున్న ముక్కోటి ఏకాదశి సందర్భంగా చేస్తున్న ఏర్పాట్లను గురువారం జిల్లా ఎస్పీ సతీష్ పరిశీలించారు. స్వామి వారి దర్శనానికి వస్తున్న భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. క్యూలైన్లో ఏర్పాట్లు ఇతర అంశాలను ఆలయ ఈవో శ్రీనివాస్ రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పోలీస్ భద్రత కట్టుదిట్టంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో దేవాలయ సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.



ఏర్పాట్లపై చర్చిస్తున్న ఎస్పీ

బుక్కరాయల నాటి రాగి పలక శాసనం గుర్తింపు



శాసనం ఉన్న రాగిరేకును చూపుతున్న మైనాస్వామి, తదితరులు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

రామగిరి మండలం నసనకోట గ్రామంలో ఉన్న విజయనగర సామ్రాజ్య చక్రవర్తి సంగమవంశానికి చెందిన మొదటి బుక్కరాయల రాగి పలక శాసనాన్ని చరిత్రకారుడు మైనాస్వామి గుర్తించారు. చరిత్ర అధ్యాపకుడు డాక్టర్ ప్రతాప్ ఆహ్వానం మేరకు గురువారం పరిశోధకుడు శ్రీధర్ తో కలిసి నసనకోటలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాలివాహన శకవర్షం 1273 నందన నామ సంవత్సరం వైశాఖ బహుళ ద్వాదశి అంటే సామాన్య శకం 1352 మేలో నసన గ్రామం, పరిసర గ్రామాలకు 'గౌడ', 'దేశి గౌడ' అనే గ్రామాధికారులను నియమిస్తూ చక్రవర్తి బుక్కరాయలు రాగిపలక శాసనాన్ని రాయించారన్నారు. గుత్తి రాజ్యం పాలెజ స్థలం కనగానపల్లె పరిధిలోని నసన గ్రామం గౌడగా కొడిద కాపు చోడమరెడ్డిని రాజు నియమించినట్లు శాసనంలో ఉందన్నారు. పేరూరు, కుంటిమద్ది, కొమర గుండు,భైరవునితిప్ప, ముష్టి కోవెల, వల్లూరు,వకజంక, కేతగానిచర్ల, వరగెర, తిరుమణి, బల్ల సముద్రం తదితర గ్రామాలకు 'దేశి గౌడ'లను గ్రామాధికారులుగా పేర్కొంటూ వారందరికీ పెద్ద గౌడగా పెద్ద చోడమరెడ్డిని నియమించినట్లు ఈ శాసనం చెబుతోందని మైనాస్వామి వివరించారు. కనగానపల్లి. సనప ప్రాంతాలను పరిపాలన చేయడానికి గ్రామాధికారులు, గ్రామాల వృత్తి పనివారి వివరాలు, వారికి కేటాయించిన భూములు గల ఊర్ల సరిహద్దులు వంటి విషయాలను అందులో పేర్కొన్నారన్నారు. గ్రామ పాలకుల పేర్లతోపాటు గణికుల పేర్లను కూడా శాసనంలో ప్రస్తావించడం నాటి పాలనా పద్ధతులకు అద్దం పడుతోందని చరిత్రకారుడు తెలిపారు. పౌరోహితుడు మాడుగుల తిమ్మయ్య, గణికుడు నందవరం తిమ్మయ్య, మరో గణికుడు కన్నడ రామయ్య, తలారికాడు రాముడు, విశ్వకర్మ, కుమ్మరి,రజక వంటి గ్రామ వృత్తికారులకు రాజు బుక్కరాయలు భూమిని దానంగా ఇచినట్లు శాసనం చెబుతోందన్నారు. ప్రతి గ్రామాధికారి గౌడ పెద్దచోడమ రెడ్డి చెప్పినట్టు నడుచుకోవాలని రాజు అందులో ఆదేశించాడన్నారు. రాగి పలక శాసనం రెండో వైపు పై భాగంలో సనప రాజుల వరప్రసిద్ధి అని ఉండగా చివరి భాగంలో 'శ్రీ విరూపాక్ష' అని ఉందని మైనాస్వామి పేర్కొన్నారు. రాగి పలక ముందు భాగంలో సూర్యుడు- చంద్రుడు, చక్రము- శంఖం, తిరునామాలు, యజ్ఞవాటిక వెనుక భాగంలో కింది వైపున నాగలి గుర్తులు ఉన్నాయని ఆయన తెలియజేశారు. పెన్నా నది పరిసర గ్రామాల భూములను దానం చేయడం, కాలువల ద్వారా పెన్న నీటిని మళ్లించి వ్యవసాయ అభివృద్ధికి విజయనగర పాలకులు ఎంతగానో పాటుపడినట్టు శాసనం ద్వారా తెలుస్తోందన్నారు. నసనకోట గ్రామదేవత దుర్గమ్మ వార్షిక ఉత్సవాల సమయంలో రాగి పలకను గుడిలో ఉంచి పూజ చేస్తామని రాగి పలక శాసనాన్ని పరిరక్షిస్తున్న మారక భాస్కరరెడ్డి చెప్పారు. మాడుగుల ఆత్రేయ శర్మ, గంగాధర్, పూజారి ఎర్రప రెడ్డి, సుధాకర్ తదితరులు దుర్గమ్మ గుడిని సందర్శించిన వారిలో ఉన్నారు.

వినియోగదారుల సేవలకు అవార్డు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

వినియోగదారుల ఉత్తమ సేవలకు గుర్తింపుగా పుట్టపర్తికి చెందిన వినియోగదారుల సంఘాల సమాఖ్య ప్రధాన కార్యదర్శి జి సురేష్ కుమార్ అవార్డు అందుకున్నారు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం జాతీయ వినియోగదారుల దినోత్సవం బుధవారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీషా అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర సివిల్ సప్లైస్ మేనేజింగ్ డైరెక్టర్ ఢిల్లీ రావు, రాష్ట్ర సివిల్ సప్లై డైరెక్టర్ ఆర్ గోవిందరావు , లీగల్ మెట్రాలజీ జాయింట్ కంట్రోలర్ కష్ణ చైతన్య పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వినియోగదారుల సంఘాలలో ఉత్తమ సంఘాలకు రాష్ట్ర వినియోగదారుల వ్యవహారాల, పౌరసరఫరా శాఖ మేనేజింగ్ డైరెక్టర్ ఢిల్లీ రావు చేతుల మీదుగా రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డులు అందజేశారు. అందులో భాగంగా తాను ఈ అవార్డును అందుకున్నట్లు పుట్టపర్తికి చెందిన వినియోగదారుల సంఘాల సమాఖ్య ప్రధాన కార్యదర్శి జి సురేష్ కుమార్ తెలిపారు.



అవార్డు అందుకుంటున్న సురేష్‌కుమార్

బలిజల రాజకీయ ఎదుగుదలకు తోడ్పాటు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కదిరి టౌన్

కదిరి నియోజకవర్గంలోని బలిజలకు గతంలో ఇచ్చిన హామీ ప్రకారం తొందరలోనే కళ్యాణ మండపం పనులు ప్రారంభిస్తామని అలాగే శ్రీ కష్ణదేవరాయల విగ్రహాన్ని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేస్తామని ఎమ్మెల్యే కంది కుంట వెంకట ప్రసాద్ స్పష్టం చేశారు. గురువారం కదిరి పట్టణ బలిజ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన 2026 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎమ్మెల్యే కంది కుంట చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తన రాజకీయ ఎదుగుదలకు బలిజలు తోడ్పాటు అందించారని వారి సహకారం గుర్తుంచుకుంటానని చెప్పారు. ఈ కార్యక్రమంలో బలిజ సంఘం అధ్యక్షులు జనసేన పార్టీ నాయకులు మార్కెట్ యార్డ్ చైర్మన్ అనసూయ చౌదరి. ఆ సంఘం నాయకులు మాజీ కౌన్సిలర్ కునక పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, తదితరులు

వినియోగదారులకు మెరుగైన సేవలు

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

స్థానిక కె హెచ్. ప్రభుత్వ డిగ్రీకళాశాలలో జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని గురువారం విద్యార్థుల మధ్య ఘనంగా నిర్వహించారు. వాణిజ్య శాస్త్ర విభాగాధిపతి యం. పుష్పావతి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె. ప్రభాకర్ రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డా కె ప్రభాకర్ రెడ్డి వినియోగదారుల చట్టాల గురించి, వినియోగదారుల హక్కుల గురించి, విభాగాలు, ఫోరమ్స్ పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం నిర్వహించిన క్విజ్ పోటీల్లో ప్రతిభ కనపర్చిన వారికి బహుమతులు ప్రదానం చేశారు.

టిడిపి అధికార ప్రతినిధిగా ముతుకూరు బీబీ

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

టిడిపి జిల్లా తెలుగుదేశం పార్టీ అనుబంధ కమిటీలని పార్టీ అధిష్టానం ప్రకటించింది. ఇందులో భాగంగా ధర్మవరం పట్టణానికి చెందిన ముత్తుకూరు బీబీని జిల్లా అధికార ప్రతినిధిగా నియమించారు. ఈసందర్భంగా బీబీ పరిటాల శ్రీరామ్ కి కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు



క్రిస్మస్ వేడుకల్లో మంత్రి సవిత



క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే కందికుంట



ఓడిసిలో క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి-పెనుకొండ

సమాజంలో ఐక్యత, ప్రేమ, సోదర భావాలు పెరగాలని రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖల మంత్రి సవిత ఆకాంక్షించారు. క్రిస్మస్ సందర్భంగా గురువారం పట్టణంలోని సిఐజి చర్చిలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరై మంత్రి సవిత క్రిస్మస్ కేక్ కట్ చేసి అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ సమాజంలో మనుషుల మధ్య ఐక్యత, ప్రేమ, సోదర భావాలు పెరగాలన్నారు. అందరూ సంతోషంగా జీవించాలని ఆకాంక్షిం చారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, చర్చి ఫాథర్లు తదితరులు పాల్గొన్నారు.

గుడిబండ : మండల వ్యాప్తంగా వివిధ గ్రామాల్లో క్రైస్తవులు గురువారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరుపుకొన్నారు. బుధవారం అర్ధరాత్రి నుంచే చర్చిలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కేక్ కట్ చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. బంధువులు, స్నేహితులు, శ్రేయోభిలాషులకు విందు ఏర్పాటు చేశారు.

మడకశిర రూరల్ : మడకశిరలోని అన్ని ప్రార్థనా మందిరాల్లో భక్తిశ్రద్ధలతో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. క్రైస్తవులు ప్రార్థనా మందిరాల్లో జరిగిన కార్యక్రమాలకు హాజరై ఒకరికొకరు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. పలువురు ప్రముఖులు క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

కొత్తచెరువు : మండల వ్యాప్తంగా క్రిస్మస్ పండుగను క్రైస్తవ సోదరులు గురువారం ఘనంగా నిర్వహించుకున్నారు. కొత్త చెరువులోనే అన్ని చర్చలలోనూ రంగురంగుల విద్యుత్‌దీపాలతో అలంకరించి. పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

నంబులపూలకుంట :మండల పరిధిలోని టిఎన్ పల్లి, నంబులపూలకుంట, ధనియా చెరువు, వెలచెలమల గ్రామాలలో గురువారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజలు పాస్టర్లు పాల్గొన్నారు.

బత్తలపల్లి : క్రిస్మస్ సందర్భంగా గురువారం మండలంలోని అన్ని చర్చిలలో ప్రార్థనలు చేశారు. మండలంలోని అన్ని చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. వివిధ గ్రామాలకు చెందిన క్రిష్టియన్లు బత్తలపల్లికి చేరుకుని చర్చిలలో ప్రార్థనలు చేశారు. మండల కేంద్రంలోని చర్చి ఆఫ్ క్రిస్ట్ ఫామ్రాజన్, ఎస్ఈఎఫ్ చర్చిలో ఫౌల్, భక్తిసింగ్ చర్చిలో చంద్రరాజ్, ఇమానుయల్ చర్చిలో సుదర్శన్, బేతనీయ ప్రార్థనామందరంలో ప్రతాప్, రివైవాల్ చర్చిలో రూపాసుహాసిణి, ఇందిరమ్మ కాలనీలో డేనియల్. విజయ్‌కుమార్ ఫాస్టర్లు ఇచ్చిన సందేశాలను ఆలకించారు. అదే విధంగా ఆర్టీటీ ఆసుపత్రిలో క్రిస్మస్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. అనంతరం చిన్నారులచే నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ఓబుళదేవర చెరువు : మండల కేంద్రంలోని సి అండ్ ఐ జి మిషన్ చర్చితో పాటు పలు చర్చిలలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. క్రిస్మస్ విశిష్టతను పాస్టర్ రెవరెండ్ డాక్టర్ ఎంజి జయనందం వివరించారు. ఈ కార్యక్రమంలో చర్చి కార్యదర్శి దార్ల రాజశేఖర్, చర్చి సీనియర్ సభ్యురాలు టి ఎం భారతి, సభ్యులు కె.బాలరాజు, సునీల్ కుమార్, ప్రభు కుమార్, అశీర్వాదమ్మ, తదితరులు పాల్గొన్నారు.

తలుపుల : మండల పరిధిలోని కుర్లి పంచాయతీ సిద్దుగురి పల్లిలోనిసి అండ్ ఐ జి చర్చ్ నందు నిర్వహించిన క్రిస్మస్ వేడుకలలో తలుపుల మండల కన్వీనర్ డికే బాబు పాల్గొని, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కుర్లీ శివారెడ్డి, ఆవుల వివేకానంద రెడ్డి, ఉత్త రెడ్డి, మౌలా, హిదాయతుల్లా, తులసి తదితరులు పాల్గొన్నారు.

గాండ్లపెంట : మండలంలో గురువారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పాస్టర్లు ఆయా చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ధర్మవరం రూరల్ : పట్టణంలోని రైల్వే స్టేషన్లో సెయింట్ ఆంద్రు కేథలిక్ చర్చిలో గురువారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఫాదర్ ఆంథోనీ రాజ్ ఆధ్వర్యంలో సాంప్రదాయ పద్ధతిలో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమంలో వందల సంఖ్యలో క్రైస్తవులు పాల్గొన్నారు.

కదిరి అర్బన్ : కదిరి పట్టణం టవర్ క్లాక్ దగ్గర ఉన్న సీ ఐ జీ యం మిషన్ చర్చ్ లో జరిగిన క్రిస్మస్ వేడుకలలో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పాల్గొన్నారు. తనకు మతాల కన్నా మనుషులపైనే అభిమానం ప్రేమ ఎక్కువ అని అందువల్లనే ఒక ప్రజాప్రతినిధిగా అన్ని మతాలను కలుపుకొని వారికి ఉన్న సమస్యల తొలగింపులనకు సౌకర్యాలు కల్పించడమే ధ్యేయంగా పనిచేస్తానని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ తెలిపారు. క్రిస్టియన్స్ మత పెద్దలు చేసిన ప్రార్థనలో ఆయన పాల్గొన్నారు.

హిందూపురం : హిందూపురం పట్టణ, పరిసర ప్రాంతాల్లో ని చర్చిలో గురువారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని సీ అండ్ ఐ జి మిషన్ చర్చి, సీ అండ్ ఐ జి కాంపౌండ్ చర్చి తదితర చర్చిల్లో క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. స్థానిక సీ అండ్ ఐ జి మిషన్ చర్చిలో క్రిస్టమస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్, ఎం.ఎల్.ఏ. వ్యక్తిగత కార్యదర్శులు పావులూరి శ్రీనివాసురావు, వీరయ్య, బాలాజీ, సీనియర్ టిడిపి నాయకులు గ్రీన్ పార్క్ నాగరాజు, టిడిపి పట్టణ అధ్యక్షులు ప్రెస్ వెంకటేష్, టిడిపి నాయకులు నాగరమోదా శివ, బేకరి గంగాధర్, ఎన్ బి కే రాజు, సుమో సీనా తదితరులు పాల్గొన్నారు.



సీతారాం ఏచూరికాలనీలో కేక్ కోస్తున్న ఐద్వా మహిళలు



రాయదుర్గంలో పాస్టర్లకు కేక్ తినిపిస్తున్న విప్ కాలవ శ్రీనివాసులు



యల్లనూరులో చీరలు పంపిణీ చేస్తున్న పాస్టర్ బాబు

ఘనంగా క్రిస్మస్ వేడుకలు



రాచానపల్లిలో కేక్ కోస్తున్న పాస్టర్, చిన్నారులు

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో ఉన్న చర్చిలో గురువారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్పీ పి.జగదీష్ కేక్ కోసం పంచిపెట్టారు. అనంతరం క్రైస్తవులకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఆర్ అదనపు ఎస్పీ ఇలియాస్ బాషా, ఆర్ఐలు పవన్‌కుమార్, చర్చి కమిటీ సభ్యులు సిఐ సుబ్బరాయుడు, హెడ్ కానిస్టేబుల్ ప్రకాష్, కానిస్టేబుళ్లు ఈశ్వర్, ప్రవీణ్, రాజారత్నం, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్‌నాథ్, సుధాకర్‌రెడ్డి, గాండ్ల హరినాథ్, ఫాస్టర్ వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

అలాగే నగరంలోని సరోజినీ రోడ్డులో ఉన్న లోటస్ కిడ్స్ ఇంటర్నేషనల్ అమెరికన్ పాఠశాలలో గురువారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులకు క్రిస్మస్ గొప్పదనాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ నిర్మల ఆనంద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అలాగే అనంతపురం రూరల్ మండలం రాచానపల్లి పంచాయతీలోని యేసు కృపా మందిరంలో సంఘ కాపరి నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా కేక్ కోసం పంచిపెట్టారు. లీనా డేబోరా, డి నా జాయిస్ ఆరాధన చేశారు. అనంతరం దుస్తులు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పాస్టర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు నెహెమ్యా రెడ్డివారి నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఐద్వా ఆధ్వర్యంలో..

అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో స్థానిక సీతారాం ఏచూరి కాలనీలో గురువారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా క్రిస్మస్ గీతాలు ఆలపించారు. తర్వాత కేక్ కోసం పంచిపెట్టారు. ముఖ్యంగా మహిళలు, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐద్వా నగర కార్యదర్శి అశ్విని,కోశాధికారి గీత మాట్లాడుతూ క్రిస్మస్ పండుగ యొక్క అసలైన సందేశమైన ప్రేమ, శాంతి, సోదర భావం, సమానత్వం,సమాజంలో పెరుగుతున్న అసమానతలు వివక్షలకు వ్యతిరేకంగా ఐక్యంగా నిలబడాల్సిన అవసరం ఉందని తెలిపారు. కాలనీలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు,మౌలిక వసతుల లోపాలు, జీవన భద్రత అంశాలపై చర్చ జరిగిందని, మహిళల హక్కులు,భద్రత, సమాన అవకాశాల కోసం ఐద్వా నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు. ఈ క్రిస్మస్ వేడుకలు కాలనీలోని ఐక్యతను, సౌహార్ద్యాన్ని మరింత బలపరిచాయని వివరించారు. ఈ కార్యక్రమంలో నగర కమిటీ సభ్యులు పద్మావతి, విజయలక్ష్మి, అరుణ, మాధవి, కళావతి, తదితరులు పాల్గొన్నారు.

నార్పల : మండల కేంద్రంలోని ఎరుషలేము, కృపాకర్, శాలెం, జీవనది బైబిల్ మిషన్, బేరాక్ ప్రార్థనా మందిరం చర్చిలతోపాటు మండలవ్యాప్తంగా క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఇందులో భాగంగా పాస్టర్స్ పాల్ డేవిడ్, సదానందం, మహారాజ్, జాన్ ఆకుల్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

శింగనమల : మండలవ్యాప్తంగా క్రిస్మస్ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఇందులో భాగంగా ఆయా చర్చిల్లో కేక్‌లు కోసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా పాస్టర్లు క్రిస్మస్ సందేశాన్ని చదివి వినిపించారు. తర్వాత అన్నదానాలు చేశారు. ఈ కార్యక్రమాల్లో చర్చి ఫాదర్లు, క్రైస్తవులు, తదితరులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు : భువినుంచి దివికేగిన ఏసుబోధనలు ప్రతి ఒక్కరూ మరవరాదని పాస్టర్ జాన్డేవిడ్ సూచించారు. క్రిస్మస్ వేడుకల్లో భాగంగా పెద్దవడుగూరులోని ఐఎస్ఇసి చర్చిలో గురువారం జరిగిన వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడుతూ ప్రేమభావాన్ని, సేవతత్పరత, కరుణ, ధాతృత్వం, త్యాగం అన్నింటిని మానవాళికి ఏసు అందించిన మహోన్నతమైన సందేశాలని తెలిపారు. అనంతరం ఏసు జననం పలు అంశాలపై తెలియజేసి కేక్‌లుకోసం పంచారు. అలాగే చిన్నవడుగూరు, దిమ్మగుడి, చిత్రచేడు, రావులుడికి, క్రిష్టిపాడు, లక్షుంపల్లి, విరుపాపురం, గుత్తిఅనంతపురం, కొండూరు, వీరన్నపల్లి, కండ్లగూడూరు, వెంకటాంపల్లి తదితర గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి.

యల్లనూరు : మండలంలోని వివిధ గ్రామాల చర్చిల్లో గురువారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఇందులో భాగంగా క్రీస్తు జీవిత విశేషాలను వివరించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని జీషస్ గ్లోరి చర్చిలో పాస్టర్ బాబు మహిళలకు చీరలు పంపిణీ చేశారు. తర్వాత అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేశారు.

రాయదుర్గం : క్రీస్తు బోధనలు ఆచరణీయమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తెలిపారు. క్రిస్మస్ సందర్భంగా పట్టణంలోని యేసయ్యా మిరాకిల్ చర్చిలో గురువారం నిర్వహించిన వేడుకల్లో కాలవ పాల్గొని కేక్ కట్ చేశారు. ఆయన మాట్లాడుతూ లేని దానికోసం ఆలోచిస్తూ అసూయ, ఈర్ష్యా ద్వేషాలు పెంచుకుంటూ జీవితాన్ని కష్టమయం చేసుకోవడం కంటే ఉన్న దాంట్లో సంతృప్తిగా జీవనాన్ని కొనసాగించడం ఎంతో ఆనందాన్ని ఇస్తుందన్నారు. క్రీస్తు జీవితం మానవాళికి ఓ గొప్ప సందేశం అన్నారు. మదర్ థెరెసా జీవనం అందరికీ ఆదర్శప్రాయమన్నారు. అనేక అంశాలతో ఇమిడి ఉన్న క్రీస్తు బోధనలో కనీసం 20, 30 శాతం మన నిజ జీవితంలో పాటించగలిగితే మన జీవితం ఎంతో సుఖవంతంగా ముందుకు సాగిపోతుందన్నారు. క్రైస్తవులకు కాలవ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి పసుపులేటి నాగరాజు, ప్రధాన కార్యదర్శి కిరణ్ కుమార్, పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ పురుషోత్తం, నాయకులు ఇనాయత్, చిన్నికృష్ణ, మల్లి, క్రైస్తవులు పాల్గొన్నారు.

రాయదుర్గం పట్టణంలోని రాజీవ్‌గాంధీకాలనీలో ఉన్న కింగ్ ఆఫ్ షాలేమ్ క్రైస్ట్ చర్చిలో పాస్టర్ జె.కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. క్రైస్తవులు పెద్దఎత్తున పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా పాస్టర్ క్రీస్తు జననం, క్రిస్మస్ సందేశాన్ని వినిపించారు. యువతీ, యువకులు క్రీస్తు పాటలు ఆలపించారు. అనంతరం క్రిస్మస్ కేక్ కట్ చేసి అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. చర్చి సభ్యులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. చివరగా పేద మహిళలకు ఉచితంగా చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చర్చి అభివృద్ధి మండలి సభ్యులు రాజశేఖర్, మురళి, చిన్నబాబు, రామాంజి, రాజన్న, యూత్ సభ్యులు రెడ్డి జగదీష్, ఈశ్వర్, ప్రతాప్, చరణ్, వంశీ, వివిధ ప్రాంతాల క్రైస్తవులు పాల్గొన్నారు.

బొమ్మనహాల్ : మండల పరిధిలోని బొమ్మనహాల్, శ్రీధరఘట్ట, ఉద్దేహాల్, గోవిందవాడ, దర్గాహొన్నూరు, కుర వల్లి, నేమకల్లు, శ్రీరంగాపురం, గోనేహాల్, హరేసముద్రం, లింగదహాల్, సింగానహల్లి, దేవగిరి, బండూ రు, కళు దేవనహళ్లి, పలు గ్రామాల్లో క్రైస్తవులు క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. క్రైస్తవులు బుధవారం అర్ధరాత్రి నుంచే చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. గురువారం ఉదయం పాస్టర్లు క్రీస్తు జననం, బోధనలు, క్రిస్మస్ ప్రాధాన్యతను వివరించారు. ప్రార్థనల అనంతరం ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకొన్నారు.

కుందుర్పి : మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రముఖులు మాట్లాడుతూ క్రీస్తు జీవితం ఆచరణీయం, ఆదర్శప్రాయమన్నారు. ప్రతి ఒక్కరూ శాంతిని కోరుకోవా లన్నారు. అన్ని చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాస్టర్లు క్రీస్తు జననం, బోధనలను వినిపించారు. ఎనుములదొడ్డి విక్టరీ ప్రార్థనా మందిరంలో పార్టీలకు అతీతంగా ప్రార్థనలు చేసి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ హనుమంతరాయుడు, సర్పంచులు మారుతీశ్వరి రామ్మూర్తి, మహదేవమ్మ,



పెద్దవడుగూరులో కేక్ కోస్తున్న పాస్టర్, చిన్నారులు

నాయకులు విజయకుమార్, తిప్పేస్వామి, నాగరాజు, ఆనంద్, కెఎల్.ప్రసాద్, వి.హనుమంతరాయుడు, ప్రభాకర్, తిమ్మరాయుడు, రామాంజనేయులు, పాస్టర్ అజర్యా, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం : క్రీస్తు బోధనలు ఆచరణీయమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తెలిపారు. క్రిస్మస్ సందర్భంగా పట్టణంలోని యేసయ్యా మిరాకిల్ చర్చిలో గురువారం నిర్వహించిన వేడుకల్లో కాలవ పాల్గొని కేక్ కట్ చేశారు. ఆయన మాట్లాడుతూ లేని దానికోసం ఆలోచిస్తూ అసూయ, ఈర్ష్యా ద్వేషాలు పెంచుకుంటూ జీవితాన్ని కష్టమయం చేసుకోవడం కంటే ఉన్న దాంట్లో సంతృప్తిగా జీవనాన్ని కొనసాగించడం ఎంతో ఆనందాన్ని ఇస్తుందన్నారు. క్రీస్తు జీవితం మానవాళికి ఓ గొప్ప సందేశం అన్నారు. మదర్ థెరెసా జీవనం అందరికీ ఆదర్శప్రాయమన్నారు. అనేక అంశాలతో ఇమిడి ఉన్న క్రీస్తు బోధనలో కనీసం 20, 30 శాతం మన నిజ జీవితంలో పాటించగలిగితే మన జీవితం ఎంతో సుఖవంతంగా ముందుకు సాగిపోతుందన్నారు. క్రైస్తవులకు కాలవ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి పసుపులేటి నాగరాజు, ప్రధాన కార్యదర్శి కిరణ్ కుమార్, పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ పురుషోత్తం, నాయకులు ఇనాయత్, చిన్నికృష్ణ, మల్లి, క్రైస్తవులు పాల్గొన్నారు.

రాయదుర్గం పట్టణంలోని రాజీవ్‌గాంధీకాలనీలో ఉన్న కింగ్ ఆఫ్ షాలేమ్ క్రైస్ట్ చర్చిలో పాస్టర్ జె.కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. క్రైస్తవులు పెద్దఎత్తున పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా పాస్టర్ క్రీస్తు జననం, క్రిస్మస్ సందేశాన్ని వినిపించారు. యువతీ, యువకులు క్రీస్తు పాటలు ఆలపించారు. అనంతరం క్రిస్మస్ కేక్ కట్ చేసి అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. చర్చి సభ్యులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. చివరగా పేద మహిళలకు ఉచితంగా చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చర్చి అభివృద్ధి మండలి సభ్యులు రాజశేఖర్, మురళి, చిన్నబాబు, రామాంజి, రాజన్న, యూత్ సభ్యులు రెడ్డి జగదీష్, ఈశ్వర్, ప్రతాప్, చరణ్, వంశీ, వివిధ ప్రాంతాల క్రైస్తవులు పాల్గొన్నారు.

బొమ్మనహాల్ : మండల పరిధిలోని బొమ్మనహాల్, శ్రీధరఘట్ట, ఉద్దేహాల్, గోవిందవాడ, దర్గాహొన్నూరు, కుర వల్లి, నేమకల్లు, శ్రీరంగాపురం, గోనేహాల్, హరేసముద్రం, లింగదహాల్, సింగానహల్లి, దేవగిరి, బండూ రు, కళు దేవనహళ్లి, పలు గ్రామాల్లో క్రైస్తవులు క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. క్రైస్తవులు బుధవారం అర్ధరాత్రి నుంచే చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. గురువారం ఉదయం పాస్టర్లు క్రీస్తు జననం, బోధనలు, క్రిస్మస్ ప్రాధాన్యతను వివరించారు. ప్రార్థనల అనంతరం ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకొన్నారు.

కుందుర్పి : మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రముఖులు మాట్లాడుతూ క్రీస్తు జీవితం ఆచరణీయం, ఆదర్శప్రాయమన్నారు. ప్రతి ఒక్కరూ శాంతిని కోరుకోవా లన్నారు. అన్ని చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాస్టర్లు క్రీస్తు జననం, బోధనలను వినిపించారు. ఎనుములదొడ్డి విక్టరీ ప్రార్థనా మందిరంలో పార్టీలకు అతీతంగా ప్రార్థనలు చేసి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ హనుమంతరాయుడు, సర్పంచులు మారుతీశ్వరి రామ్మూర్తి, మహదేవమ్మ, నాయకులు విజయకుమార్, తిప్పేస్వామి, నాగరాజు, ఆనంద్, కెఎల్.ప్రసాద్, వి.హనుమంతరాయుడు, ప్రభాకర్, తిమ్మరాయుడు, రామాంజనేయులు, పాస్టర్ అజర్యా, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



లోటస్ కిడ్స్ పాఠశాలలో క్రిస్మస్ సంబరాలు



రాయదుర్గంలో కేక్ కోస్తున్న పాస్టర్, చిన్నారులు



కుందుర్పిలో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్నా నాయకులు

పోషకాహారంపై అవగాహన

ప్రజాశక్తి-బెలుగుప్ప



పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న ఐసిడిఎస్ సూపర్‌వైజర్

వయసు తగ్గ బరువు, ఎత్తు లేని పిల్లలకు జిజిఎస్, ఎన్ఆర్‌సిలో పోషకాహారంపై తల్లులకు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్‌వైజర్ రమాదేవి మాట్లాడుతూ బిడ్డ పుట్టినప్పుడు వయసుకు తగ్గ బరువు , ఎత్తు, పెరగకున్నప్పుడు అనంతపురం జిజిఎస్ ఎన్ఆర్‌సిలో అడ్మిట్ చేస్తే పిల్లలకు న్యూట్రిషన్ ఫుడ్‌తోపాటు బిడ్డ బరువు ఎలా పెంచాలని, ఆహార పద్ధతులను నేర్పిస్తారన్నారు. 14 రోజులపాటు అలవాట్లతో బిడ్డు బరువు ఎలా పెంచాలో నేర్పుతారన్నారు.

ప్రభుత్వ భూమిపై కబ్జాదారుల కన్ను

ప్రజాశక్తి -నంబులపూలకుంట

మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయానికి కూతవేటు దూరంలో ప్రభుత్వ భూమిపై కబ్జాదారులు కన్నేశారు. ప్రభుత్వ భూమిని ఆక్రమణదారులు ఆక్రమించుకొని అమాయకపు ప్రజలకు అమ్ముకుంటు లక్షల రూపాయల్లో సొమ్ము చేసుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి. భూముల ధరలకు రెక్కలు రావడంతో ఇవి అక్రమార్కులకు వరంగా మారింది. ఇప్పటికే ముగ్గురకి అమ్మకాలు జరిగాయని పక్కన సర్వే నెంబర్ తో రిజిస్ట్రేషన్ చేశారని ఇందులో ఒక్కరు పునాది వేసుకొని పనులు ప్రారంభించారుజ ప్రభుత్వ భూమిని రెవిన్యూ అధికారులు పరిశీలించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి భవిష్యత్ లో నిరుపేదలకు ఇంటిపట్టాలు, ప్రభుత్వ భవనాలకు స్థలాలు ఉండేలా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై తహశీల్దార్ దేవేంద్రనాయక్ మాట్లాడుతూ రికార్డులు పరిశీలించి, అక్రమ పట్టాలు పొంది ఉంటే రద్దు చేస్తామని విక్రయాలు జరిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

ప్రజాశక్తి - కొత్తచెరువు

మండల పరిధిలోని తలమర్ల గ్రామంలో బస్టాండ్ కూడలి నుంచి నాగిరెడ్డిపల్లి కి వెళ్లే తారు రోడ్డు వరకు మండల పరిషత్ నిధులు 16 లక్షల రూపాయలతో చేపడుతున్న సిసి రోడ్డు పనులను ఎంపీపీ గాయత్రి రెడ్డప్పరెడ్డి, సర్పంచి రత్నమ్మ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో సిసి రోడ్ల నిర్మాణానికి మండల గ్రాండ్ నుండి నిధులను మంజూరు చేశామని ఈ పనులను త్వరతిగతినం పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సూరి తదితరులు పాల్గొన్నారు.

డయాలసిస్ సేవల మెరుగుకు చర్యలు

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ధర్మవరం పట్టణం లోని డయాలసిస్ కేంద్రాన్ని మరింత అభివృద్ధి చేస్తామని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి అభివద్ధి కమిటీ సభ్యులు డాక్టర్ నరసింహులు, డాక్టర్ సోనియా, పుల్లయ్య తెలిపారు. ఈ సందర్భంగా వారు గురువారం పట్టణంలోని పోతుకుంట రోడ్డు వద్ద గల నూతన ఆసుపత్రి భవనములో డయాలసిస్ (రక్త శుద్ధి కేంద్రం) ప్రథమ వార్షికోత్సవ్వాన్ని రోగులు, సిబ్బంది ఆధ్వర్యంలో జరుపుకున్నారు. అనంతరం వారు డయాలసిస్ తో వైద్య చికిత్సలు అందుతున్న వారితో మాట్లాడి వైద్యం అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం డయాలసిస్ రోగులకు స్పందన ఆసుపత్రి డాక్టర్, ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యురాలు డాక్టర్ సోనియా పండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డయాలసిస్ హాస్పిటల్ మేనేజర్ మునీంద్ర ,టెక్నికల్ అసిస్టెంట్ వేణు, గణేష్, స్టాఫ్ నర్సు శశీల, సరస్వతి, షాహిదా తదితరులు పాల్గొన్నారు.

ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ

ప్రజాశక్తి కదిరి అర్బన్

ఈనెల 27,28 తేదీలలో జరగనున్నన ఇస్తేమా నేపథ్యంలో ఆ ప్రదేశాన్ని ఎస్పీ సతీష్ కుమార్ గురువారం పరిశీలించారు. ముస్లిం మత పెద్దలతో కలిసి ఇస్తామా ప్రదేశాన్ని పరిసర ప్రాంతాలను వాహనాల రాకపోకల అంశాలపై వారితో చర్చించారు. సుదూర ప్రాంతాల నుంచి వస్తున్న మైనార్టీ సోదరులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఎస్పీ ఆదేశించారు. ఏమైనా అనుమానాలు ఉంటే పై అధికారులు కానీ సంబంధిత మత పెద్దలను అడిగి తెలుసుకోవాలన్నారు. ఇస్తేమాలో ఎవరికీ ఎలాంటి అసౌకర్యాలు లేకుండా చర్యలు చేపడతామన్నారు. ఈకార్యక్రమంలో మైనార్టీ మత పెద్దలతో పాటు టిడిపి పట్టణ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్, టిడిపి నాయకులు ఖాసిం తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐను కలిసిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి - అమడగూరు

స్థానిక పోలీస్ స్టేషన్ కు బదిలీపై వచ్చిన ఎస్ఐ గోపాల్‌కృష్ణను టిడిపి స్థానిక నాయకులు గురువారం కలిశారు. గురువారం పోలీస్ స్టేషన్లో ఎస్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూలమాలలు, శాలువాలతో సన్మానించారు.ఈ సందర్భంగా టిడిపి మండల కన్వీనర్ గోపాల్ రెడ్డి మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఎస్ఐ కోరారు.అలాగే మండలంలో వ్యవసాయ బోరుబావుల వద్ద విద్యుత్ ట్రాన్సఫార్మర్ లు దొంగతనాలు చేస్తున్నారని ఎస్ఐ ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు..అదేవిధంగా ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు.యువత మద్యం సేవిస్తున్నారని పటిష్టమైన భద్రత ఏర్పాటు చేయాలని ఎస్ఐని కోరారు.ఈ కార్యక్రమంలో సర్పంచి షబ్బీర్ బాషా, టిడిపి నాయకులు కుమార్ రెడ్డి, రాజారెడ్డి, వడ్డెర సంఘం అధ్యక్షులు దొనకొండ రమణప్ప,మంజుల లక్ష్మన్న,రమణ,కిష్టప్ప,టైలర్ రామాంజులు,నరసింహమూర్తి, మారుతీ,శంకర,హనుమంతు రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సుబ్రహ్మణ్యేశ్వర స్వామి రథోత్సవం

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం సమీపంలో ఉన్న సుబ్రహ్మణ్యేశ్వర స్వామి బ్రహ్మరథోత్సవం గురువారం వైభవంగా జరిగింది. ఉదయం సుప్రభాత సేవతో పూజా కార్యక్రమాలను అర్చకులు ప్రారంభించారు. మూలవిరాట్ సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని వివిధ రకాల పుష్పాలు, ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ఆవరణలో హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి రథోత్సవాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమలో ఆలయ ధర్మకర్త మంజునాథ్, చంద్రశేఖర్, టిడిపి నాయకులు జెపికె రాము, ఎన్‌బికె రాజు, ఎంఎస్ మని, మల్లాపల్లి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వకలయిక

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణంలోని మహాత్మా గాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో 1977, 1978, 1979 సంవత్సరాల్లో పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల సమ్మేళనం గురువారం జరిగింది. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు పాఠశాల ఆవరణలో ఉన్న మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం తమకు విద్య నేర్పిన నాటి ఉపాధ్యాయులు నారాయణ శెట్టిని ఆహ్వానించి ఘనంగా సన్మానించారు. నాటి గురువులు, నాటి విద్యార్థులతో తమ అనుభవాలను జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. పూర్వ విద్యార్థులు తమ తమ స్నేహితులతో తాము చేసిన అల్లరి చిలిపి పనులను నెమరు వేసుకుని ఉత్సాహంగా గడిపారు. ప్రతి యేటా క్రిస్మస్ పర్వదినాన ఇలాంటి కలయిక ఉండాలని నిర్ణయించారు.



పాఠశాలలో గురువుతో పూర్వ విద్యార్థులు

టిడిపి జిల్లా అధికార ప్రతినిధిగా అనిల్‌కుమార్

ప్రజాశక్తి-శింగనమల



జిల్లా టిడిపి అధికార ప్రతినిధిగా నూతనంగా నియమితులైన మండల పరిధిలోని పెద్దమట్లగొందికి చెందిన కాయల అనిల్‌కుమార్ యాదవ్‌కు మండలంలోని నాయకులు, కార్యకర్తలు అభినందలు తెలిపారు. చాలాఏళ్లుగా పార్టీలో పని చేస్తున్న సీనియర్ నాయకులు అనిల్‌కుమార్ సేవలను గుర్తించిన అధిష్టానం జిల్లా అధికార ప్రతినిధిగా నియమించింది. ఈ సందర్భంగా అనిల్‌కుమార్ మాట్లాడుతూ తాను పార్టీకి చేసిన సేవలను గుర్తించి ప్రతినిధిగా పదవి ఇవ్వడం సంతోషకరమన్నారు. తన పదవికి కృషి చేసిన ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, ఎంపి అంబికా లక్ష్మీనారాయణ, జిల్లా అధ్యక్షులు పూల నాగరాజు, మాజీ అధ్యక్షులు వెంకటశివుడు యాదవ్, సీనియర్ నాయకులు బండారు లీలావతి, తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు, కార్యకర్తలకు ఎల్లవేళలా రుణపడి ఉంటానని తెలిపారు.

1న శిల్పారామంలో నూతన సంవత్సర వేడుకలు

ప్రజాశక్తి-అనంతపురం

నగర సమీపంలోని శిల్పారామంలో వేచ్చేనెల 1వతేదీన నూతన సంవత్సరం దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు శిల్పారామం పరిపాలనాధికారి పి.శివప్రసాద్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు సాయంత్రం 5 నుంచి 8 గంటల వరకూ ప్రముఖ కళాకారులతో ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అలాగే ఇకపై ప్రతి శనివారం సాయంత్రం 5-30 నుంచి 7 గంటల వరకూ చెక్కబొమ్మలు, తోలుబొమ్మలు, మగ్గం వస్త్రాలు, రాగి, ఇత్తడి, పింగాణి, మట్టి వస్తువులు, చిత్రాలు ఇంకా ఏటికొప్పాక, కొండపల్లి, ఆళ్లగడ్డ, శెట్టిగుంట, ఓనిపెంట, నిమ్మలకుంట, అంగళ్లు, మదనపల్లి, మాధవరం, ధర్మవరం, మైలవరం, ప్రొద్దుటూరు, పామిడి, కంచి, కాళహస్తి, తదితర ప్రాంతాల్లోని చేతివృత్తుల కళాకారులు తయారీ విధానాన్ని ప్రొజెక్టర్ ద్వారా స్టేజ్‌పైన ప్రదర్శించనున్నట్లు వివరించారు. ఈ సదావకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అప్పిరెడ్డి హరినాథరెడ్డికి ఆటా లిటరరీ ఎక్సెలెన్స్ అవార్డు

ప్రజాశక్తి-అనంతపురం



సాహితీ సాంస్కృతిక రంగాల్లో రెండు దశాబ్దాలుగా కృషి చేసిన అప్పిరెడ్డి హరినాథరెడ్డికి అమెరికన్ తెలుగు అసోసియేషన్ (ఆటా) ఆటా ఎక్సెలెన్స్ అవార్డును ప్రకటించింది. ఈమేరకు హైదరాబాదులో డిసెంబర్ 12 నుంచి ప్రారంభమైన ఆటా వేడుకలు 27వతేదీన సాయంత్రం రవీంద్ర భారతిలో ముగియనున్నాయి. దీంతో ముగింపు సభలో హరినాథరెడ్డి అవార్డును అందుకోనున్నారు. కాగా అప్పిరెడ్డి హరినాథరెడ్డి రాయలసీమ ప్రాంతంలో వెలుగులోకి రాని అనేక సాహితీ సాంస్కృతిక అంశాలు, పత్రికలను వెలుగులోకి తెచ్చారు. సాధన పత్రికపై వీరు వెలువరించన పుస్తకానికి కేంద్ర సాహిత్య అకాడమీ యువపురస్కారం కూడా 2014లో అందుకున్నారు. సాహిత్య పరిశోధనతో పాటు నిరంతరం రాయల సామాజిక సమకాలీన విషయాలపై వందలాది వ్యాసాలు రాశారు. కేవలం సాహిత్య పరిశోధనలకే పరిమితం కాకుండా వేమన అధ్యయన, అభివృద్ధి కేంద్రం, రాయలసీమ సాంస్కృతిక వేదిక, వేమన ఫౌండేషన్ తదితర సంస్థలు స్థాపించి సాహితీ కార్యక్రమాలు, రాయలసీమ సాంస్కృతికోద్యమ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దశాబ్ధాకాలంగా రాయలసీమ మహాకవి సమ్మేళనాలు, సీమ సాహితీ పోటీలు, తెలుగు భాషా సాహిత్య కార్యక్రమాలు, ఉపన్యాసాలు, సదస్సులు, ప్రదర్శనలు నిర్వహిస్తూ కొత్తతరం సాహిత్యరంగంలోకి రావడానికి కృషి చేసారు. వేమన భావాజాలం విద్యార్థులలోకి తీసుకెళ్ళడానికి ప్రతి ఏడాది వంద విద్యాసంస్థలలో పద్యపోటీలు నిర్వహిస్తున్నారు. ఆటా ఆహ్వానం పై చికాగో, నాటా ఆహ్వానంపై డల్లాస్ వెళ్లి సాహితీసభల్లో పాల్గొన్నారు.

ప్రజాశక్తి క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-నార్పల :

ప్రజాశక్తి దినపత్రిక రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను గురువారం మండల కేంద్రంలో వైసిపి ఎస్సీ సెల్ నాయకులు ప్రభుదాస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాస్తవాలను నిర్భయంగా ప్రజల్లోకి తీసుకెళ్తూ ప్రజలపక్షంగా నిలుస్తున్న ప్రజాశక్తి దినపత్రిక భవిష్యత్తులో మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.



ప్రజాశక్తి క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న వైసిపి ఎస్సీ సెల్ నాయకులు ప్రభుదాస్